



సీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి

వార్త జనరల్‌లో..





'స్థానికులకు' ఉద్యోగాలివ్వాలి

ఎంఎల్ఏ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన / భూములిచ్చి తప్పుచేశామన్న బాధితులు

ప్రజాశక్తి - చిల్లకూరు

జిందాల్ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలో అన్యాయం చేస్తోందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పారిశ్రామిక శాంతియుత నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జిందాల్ కంపెనీ ఏరియా ప్రాంత ప్రజలు కోదండ రామాంజనేయ స్వామి టెంపుల్ ఛైర్మన్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పరిశ్రమలన్నింటిలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుంటే యాజమాన్యంతో కాంప్రమైజ్ అయ్యేది లేదని స్పష్టం చేశారు. యాజమాన్యం స్పందించకుంటే శాంతియుత నిరసన రూపం మారుతుందని హెచ్చరించారు. పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు తాము వ్యతిరేకం కాదని, పేదవాళ్ల భూములు సెజ్‌లకు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇతర జిల్లాల వారికి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. బాధితులు లింగవరం గ్రామస్తులు మన్నెగుంట సర్పంచి, తమ్మినపట్నం కోదండ రామాంజనేయస్వామి టెంపుల్ ఛైర్మన్ సతీష్‌కుమార్, కొత్తూరు పాలయ్య గుమ్మలదిబ్బ శ్రీనివాసులు, కార్తీక్ మాట్లాడుతూ జిందాల్ కంపెనీ యాజమాన్యం జిందాల్ కంపెనీ ఉద్యోగులను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. స్థానికులకు చిన్న చిన్న ఉద్యోగాలు కల్పిస్తూ, టెక్నికల్ ఉద్యోగాలు వేరే ప్రాంతాల వారికి ఇస్తున్నారన్నారు. పరిశ్రమలకు భూములు ఇచ్చి చాలా తప్పు చేశామని బాధితులు నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మూగ శంకరయ్య, వెంకట కష్ణయ్య, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, మునిశేఖర్ గౌడ్, టిడిపి మండల అధ్యక్షుడు లీలావతి, శ్రావణి, శైలజ, భారతి, పూజా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి... జ్యోతిరావుపూలే..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, రేణిగుంట

బడుగుల ఆశాజ్యోతి, మార్గదర్శకులు జ్యోతిరావుపూలే అని, దళిత బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శుక్రవారం జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు,మాధవ్‌కృష్ణ, ఎన్‌డి శ్రీను, బుజ్జి, కెఆర్ఎస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట చెక్‌పోస్టు సర్కిల్లోని జ్యోతిరావుపూలే విగ్రహానికి సిపిఎం సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అంటరానితనాన్ని, కులవ్యవస్థను నిర్మూలించడంతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, సెల్వరాజ్, కుప్పస్వామి, భారతి, సుబ్బరాయుడు, హరినాథ్ పాల్గొన్నారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్‌రాజు ఆధ్వర్యంలోనూ నివాళి అర్పించారు.

మహతి ఆడిటోరియంలో 198వ జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. హైదరాబాద్ ఇన్‌కం ట్యాక్స్ అదనపు కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ మహారాష్ట్రలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పూలే వర్ణ వ్యవస్థతో కునారిల్లుతున్న సమాజానికి సంస్కారం నేర్పారన్నారు. గుంటూరుకు చెందిన సౌత్ సెంట్రల్ ఓబీసీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ వెనకబాటు, కులతత్వం తదితర అనేక కారణాల వల్ల భారతీయ సమాజం ఇతర సమాజాల కంటే సంక్లిష్టమైందన్నారు. అనంతరం టీటీడీలోని పలు విభాగాలలో విశిష్ట సేవలు అందించిన 45 మంది బీసీ ఉద్యోగులను సన్మానించారు. డెప్యూటీ ఈవోలు ఆనంద రాజు, ఎస్సీ సెల్ లైజన్ ఆఫీసర్ దేవేంద్ర బాబు పాల్గొన్నారు. (మిగిలిన వార్తలు 6లో)







నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థుల్లోనూ, తల్లిదండ్రుల్లోనూ టెన్షన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ షెడ్యూల్‌ను వెల్లడించారు. మార్చి 1-20 వరకూ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 32,432 మంది, ద్వితీయ సంవత్సరంలో 31,726 మంది పరీక్షలు రాసినట్లు ఆర్ఐఒ ప్రభాకర్‌రెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. వరుసగా సెలవులు వస్తున్న నేపథ్యంలో 15పైన ఇంటర్ ఫలితాలు వెలువడతాయని చర్చనడిచింది. అయితే విద్యార్థులు ఎంసెట్ కోచింగ్‌కు వెళ్లాలన్నా, ఇతరత్రా పరీక్షలకు హాజరవ్వాలన్నా ప్రభుత్వం అనుకున్న ప్రకారమే ఇంటర్ ఫలితాలను 12వ తేదీ శనివారం విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులపై కార్పొరేట్ కాలేజీల వారు ఒత్తిడి తెస్తున్నారు.

విరూపాక్షపురంలో కుల దురహంకార ఘటన

బండి నెమ్మదిగా నడపమన్నందుకు దాడి
గిరిజనులపై పెత్తందారుల పాశవిక దౌర్జన్యం





గాయపడిన గిరిజనులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా నడమన్నందుకు అగ్ర కులాలు గిరిజనులపై మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం విరూపాక్షపురం గిరిజన కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత గిరిజనుల కథనం మేరకు..గద్దగుంట గ్రామానికి చెందిన వన్నెకాపు సుబ్రమణ్యం కుమారుడు శ్రీకాళహస్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళు_న్నాడు. ఈ క్రమంలో విరూపాక్షపురం ఎస్టి కాలనీ వద్ద బండి వేగంగా నడపడంతో రోడ్డు దాటుతున్న ఓ చిన్నారిని ఢీకొట్ట బోయాడు. ఈ సమయంలో అక్కడే ఉన్న నాగయ్య, వెంకటేష్ లు బండి నెమ్మదిగా నడపొచ్చు కదా అంటూ చైతన్యను నిలదీశారు. దీంతో అహం దెబ్బతిన్న చైతన్య రోడ్డుపైనే నాగయ్య, వెంకటేష్ పై దాడి చేశాడు. అక్కడితో ఆగకుండా గద్దగుంటకు వెళ్లి మరో 20 మందితో తిరిగి వచ్చి ఇంకోసారి నాగయ్య, వెంకటేష్ లపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అగ్ర కులస్తుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ నాగయ్య(60), వెంకటేష్(30)లను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తొట్టంబేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గిరిజనులపై అహంకారపూరితంగా దాడికి దిగిన అగ్రకులస్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు.

గోవుల మృతి పై విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టీటీడీ పరిధిలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర గోశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ సంఖ్యలో గోవులు మరణించాయని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలోని ఎస్వీ 'గో' సంరక్షణశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోవులు మృతి చెందాయని, తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాయని వస్తున్న ఆరోపణలపై, సత్యదూరమని టిటిడి ప్రకటన చేసిందని, టీటీడీ యాజమాన్యం ప్రకటనతో సరిపెట్టుకోకుండా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని మూగజీవాలు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం, అనారోగ్యానికి గురయ్యాయన్న వార్త జంతు ప్రేమికులను టీటీడీ భక్తులను కలతకు గురిచేసిందని పేర్కొన్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియపరచడానికి విచారణ జరపటం, అఖిలపక్షం ఆధ్వర్యంలో పరిశీలన జరపటం ప్రయోజనకరంగా ఉంటుందని, నిర్లక్ష్యం కనిపించినట్టయితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చంద్రబాబు మాటలకు చేతలకు పొంతనలేదు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చంద్రబాబు మాటలకు.. చేతలకు ఏమాత్రం పొంతన లేకపోయిందని, రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చలేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో జీవించి, అప్పుల్లోనే మరణిస్తున్న పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి సీపీఐ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. స్వామినాథన్ సిఫార్సు అమలు చేయాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం చెవివాని చెవిలో శంఖం ఉందినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

మహిళ అనుమానాస్పద మృతి

నగల కోసం హత్య చేసివుంటారని అనుమానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలో ఓ మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... బోడేవాండ్లపల్లికి చెందిన శాంతమ్మ కుటుంబ అవసరాల నిమిత్తం కొన్ని సంవత్సరాల పాటు సౌదీ అరేబియాలో వలస కూలీగా పనిచేసి, కొంత సొమ్ము సంపాదించి, తిరుపతి జీవో కోనలో ఐదు అంతస్థల బిల్డింగు కట్టుకుని జీవనం సాగిస్తోంది. ఈమెకు ఇద్దరు కుమారులు. జీవకోనలో తాను కట్టుకున్న ఇంటిలో ఐదో అంతస్తులో నివసిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారులకు వివాహం కావడంతో వారిద్దరూ వేరే చోట కాపురం ఉంటున్నారు. రెండు రోజులుగా ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో 15 రోజుల క్రితం ఆమె ఉండే బిల్డింగులో రెండో అంతస్థలో అద్దెకు చేరిన వాళ్లు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించేవారు. శుక్రవారం ఉదయం ఆమె ఇంటిలో శాంతమ్మ విగతాజీవుగా పడి ఉంది.



ముందు రోజు రాత్రి ఆమెను ఆసుపత్రి తీసుకెళ్లిన అద్దె ఇంట్లో ఉంటున్న వారు. ఉదయానికి ఖాళీ చేసి ఉండడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. అద్దె ఇంట్లో ఉంటున్న వారే శాంతమ్మకు ఉరివేసి చంపేసి ఆమె నగలను దోచుకెళ్ళారని, అనుమాన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు యుపిఎస్సీ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

యుపిఎస్సీ కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (1) 2025, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ (1) 2025 పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో యుపిఎస్సీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లాలో మూడు సెంటర్లను ఏర్పాటు చేశామని, 973 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ లైజన్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని , అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో రామ్మోహన్, యుపిఎస్సీ నుంచి ఎన్‌కె స్వామి పాల్గొన్నారు.

పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్

తమ కుటుంబానికి ఎలాంటి సంబంధంలేని ఓ కేసు విషయంలో తన భర్తను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులు తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ ఓ మహిళ శుక్రవారం మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త లేదని సమాధానమిచ్చినందుకు రూరల్ ఎస్ఐ జుట్టు పట్టుకుని వీధిలోకి లాక్కొచ్చాడంటూ ఆరోపించింది. ఫిబ్రవరిలో జరిగిన ఓ దాడి కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు శుక్రవారం రూరల్ పోలీసులు భీమవరం గ్రామానికి వెళ్లారు. ఆ సందర్భంగా అక్కడ జరిగిన సంఘటనను బాధిత మహిళ మీడియా ముఖంగా ఈ విధంగా చెప్పింది. ఈ విషయంపై రూరల్ సీఐ రవి నాయక్ ను వివరణ కోరగా ఇదంతా తప్పుడు ప్రచారమంటూ కొట్టి పారేశారు.

సీఎంను కలిసిన మాజీ సర్పంచి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ముత్యాలరెడ్డి పల్లి మాజీ సర్పంచి మమత శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలో విలీనమైన తరువాత ముత్యాలరెడ్డిపల్లి ప్రాంతంలో జరిగే అభివద్ధి కార్యక్రమాలను, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతిలో వచ్చిన మార్పుపై ముఖ్యమంత్రికి తన వ్యక్తిగత సమాచారాన్ని చేరవేసినట్లు సమాచారం. కూటమిపాలనపై స్థానిక ప్రజాభిప్రాయం కూడా తెలిపినట్లు తెలుస్తోంది.

టిడిఆర్ బాండ్ల ప్రక్రియలో అలసత్వం వద్దు : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టిడిఆర్ బాండ్ల ఆన్లైన్ రిజిస్ట్రేషన్, నమోదు, తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ బాండ్ల మేళాను శుక్రవారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఆన్లైన్ అయ్యాయి? ఎవరెవరి దరఖాస్తులు ఏ స్టేజ్ లో ఉన్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుల నమోదు ప్రక్రియా ఆలస్యం అవుతోందని అన్నారు. ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు ప్రజలకు ఫోన్ చేసి వారి వివరాలు స్వయంగా సేకరించాలని ఆదేశించారు. సెలవు రోజుల్లో కూడా ఆన్లైన్ చేయించాలని అన్నారు. ఈ నెల 20 వ తేదీ లోపు అన్ని టిడిఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ స్టేజ్ కు రావాలని, అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.సి.పి. మహాపాత్ర, ఏ సి పి లు బాలాజి, మూర్తి, టిపిబిఓ లు, రోడ్డు ఇంచార్జులు, సెక్రటరీలు ఉన్నారు.

14 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు : చెన్నయ్య

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జిల్లాలో ఎస్సీ కార్పోరేషన్ రుణాల కొరకు ఈ నెల 14 నుంచి ఆన్లైన్ నందు దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఈడి తిరుపతి యు. చెన్నయ్య పేర్కొన్నారు. వివిధ పథకాలకు సంబంధించి షెడ్యూల్డ్ కులానికి చెందిన వారు పోర్టల్ లో ఈ నెల 14 నుంచి మే పదోతేదీ లోగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేసారు. పరిశ్రమల సేవా వ్యాపారం, రవాణా రంగం, వ్యవసాయ రంగాలకు సంబంధించి జిల్లాలో 1267 మందికి మొత్తం యూనిట్ల విలువ రూ.5289.90 లక్షలు, అందులో సబ్సీడీ రూ.2088.64లక్షలు, బ్యాంకు లోన్ రూ.2936.77లక్షలు, లబ్ధిదారుని వాటాగా రూ. 264.50 లక్షలు ఉంటుందని తెలిపారు. 21-50 వయస్సు, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువ పత్రం, విద్యార్హతలు కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాలోని మీసేవా లేదా ఇంటర్నెట్ కేంద్రాలలో లేదా సొంతంగానైనా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

'వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికి 13న తిరుపతి గాంధీ రోడ్డు మార్గంలోని ఏజీకే బిల్డింగ్ లో పద్మావతి వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆకుల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రాయల బలిజ సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వివాహ పరిచయ వేదికకు వివరాలకు సంఘం ప్రధాన కార్యదర్శి ఏవి ప్రతాప్ 9866355781ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

స్వర్ణరథంపై మలయప్పస్వామి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవరోజైన శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.ఉదయం 8 నుండి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.



మా బతుకులు మమ్మల్ని బతకనివ్వండి : షికారీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ఎన్నో ఏళ్లుగా తిరుమలలోని పాపవినాశనం ప్రాంతాన్ని నమ్ముకుని అక్కడికి వచ్చే యాత్రికులకు చిన్నపాటి పూసలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని, అటవీ శాఖ అధికారులు తమను తమ బతుకులు బతకనివ్వకుండా అడ్డు తగులుతూ తమ సరుకులను తీసుకెళ్లి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అక్కడి షికారులు, వ్యాపారస్తులు రాధాకష్ణ వాపోయారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన 70 సంవత్సరాల నుండి పాపవినాశనం పుణ్యక్షేత్రానికి వచ్చే శ్రీవారి భక్తులకు చిన్నపాటి వస్తువులను అమ్ముకుంటూ తమ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబర్ మాసంలో అనధికారికంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు అంటూ అటవీశాఖ అధికారులు వస్తువులను తీసుకెళ్లిపోయి అటవీ శాఖ కార్యాలయంలో ఉంచారన్నారు. ముడుపులు తీసుకుని చిన్నపాటి దుకాణాలను పెట్టించడం, ఏదైనా వివాదం జరిగితే దానిని తిరిగి అటవీ శాఖ అధికారులే తొలగించడం పాపవినాశనంలో జరుగుతోందన్నారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇక్కడ జరిగే తంతుపై పూర్తిస్థాయి విచారణ జరిపి, పాపవినాశనం ప్రాంతాన్ని నమ్ముకున్న తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో షికారీలు బాలు, చిన్నతంబి, ధర్మ, వెలియమ్మ, వెల్లిరాజు, గోపి, వెంకటేష్, మంచాలమ్మ పాల్గొన్నారు.



పోలీసుల 'డేగకన్ను'

అనుమానం వస్తే అంతే...
తిరుపతిలో 43 కేంద్రాలు గుర్తింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ మార్చి 22 నుంచి మే 25 వరకూ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై తిరుపతి పోలీసు శాఖ డేగకన్ను ఉంచింది. తిరుపతి నగరంలోనే 43 కేంద్రాలను గుర్తించింది. జిల్లావ్యాప్తంగానూ ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసుల పర్యవేక్షణతో పాటు సైబర్ పోలీసులు, టెక్నికల్ టీమ్, టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పాటై నిఘా ఉంచారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఎప్పటికప్పుడు డిఎస్‌పి అధికారుల సమావేశంలో ఆరా తీశారు.

తిరుపతి ఈస్టు పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏడాది ఒక కేసు నమోదయ్యింది. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్ అమౌంట్ కట్టకముందే కాపుగాచి ఓ టీ అంగడిలో పట్టుకోవడంతో పెటికేసుగా నమోదు చేశారు. అసలు విషయానికి వస్తే శ్రీ చైతన్య కాలేజీలో ఆ వ్యక్తి కూతురు ఇంటర్ బైపిసి చదివింది. నీట్ ఫ్రీసీటు కొట్టింది. స్కూటర్ మెకానిక్‌గా ఉన్న ఆ తండ్రి కూతుర్ని చదివించుకోడానికి 'ఆన్‌లైన్'లో డబ్బులు పెడితే పెద్దమొత్తంలో డబ్బు వస్తుందని ఎవరో చెప్పడంతో ఓ టీ అంగడి వద్ద కాపుగాచాడు. మఫ్టీలో ఉన్న పోలీసు టీం అతనిని పట్టుకుని సెల్‌ఫోన్ లాక్కున్నారు. తీరా చూస్తే ఆ సెల్ ఫోన్ నంబర్ అతని కుమార్తెది. ఆ అమ్మాయిని విచారించగా తాను నీట్‌లో ఫ్రీ సీటు కొట్టానని, తన తండ్రి తన చదువు కోసం అలా చేశారని, తన చదువుకు ఆటంకం కలిగించొద్దని ఆ అమ్మాయి ప్రాధేయపడడంతో అప్పట్లో పది రోజులు పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. నెలరోజుల పాటు జరగనున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌పైన మరింత నిఘా పెంచారు. రాత్రుల్లో 10 తరువాత యువత నగర రోడ్లలో కనిపిస్తే ప్రత్యేక టీమ్‌లు వెళ్లి లాఠీలకు పనులు చెప్పడం మొదలు పెట్టారు.


'కూటమి' ఎంఎల్ఎలకు 'సర్వేల'గుబులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు కావస్తోంది. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి భారీ మెజార్టీ రాష్ట్రంలో వచ్చిందంటే ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి వెన్నంటే ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ఆ తరువాత మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపిల పనితీరుపైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా సర్వే చేయించి, వారి పనితీరును పరిశీలిస్తానని వార్నింగ్ ఇచ్చారు. తాజాగా కుప్పం వచ్చిన సందర్భంగానూ ఇదే విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలో ప్రోగ్రామ్‌కు వెళ్లినా, కొద్దిసేపు కార్యకర్తలతో ఖచ్చితంగా మమేకం అవుతానని, వారి ద్వారా పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుంటానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలోని 71 మంది ఎంఎల్ఎల పనితీరు బాగోలేదని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా అవినీతి అక్రమాలు, భూకబ్జాలు, ఇసుకమాఫియా, లిక్కర్ మాఫియా లాంటి విషయాల్లో జోక్యం ఎక్కువై డబ్బులు దండుకుంటున్నారని సర్వే రిపోర్టులు అందాయి. తిరుపతి జిల్లాలో సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, చంద్రగిరి ఎంఎల్ఎల పనితీరు సరిగ్గా లేదని సిఎం దృష్టికి వచ్చినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాలో నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గాలపైన కంప్లైంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో ఇప్పటినుంచైనా జాగ్రత్తగా ఉండాల్సిన ఆవశ్యకత ఆయా ఎంఎల్ఎలపైన ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారానే కాకుండా, ఎన్నికలకు ముందు కూటమి అధికారంలోకి వస్తుందని సర్వేలు చేయించిన సంస్థల ద్వారానూ ఆయా ఎంఎల్ఎల పనితీరుపై సర్వే చేయించినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా ఈ సర్వేల్లో 'కామన్'గా వచ్చిన ఎంఎల్ఎలపైన అధినేత ప్రత్యేక దృష్టి సారించే అవకాశం లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో ఏడుగురిపై చంద్రబాబు అసంతృప్తి

ఆరోపణలు రాకూడదని వార్నింగ్..?



మాజీ మంత్రిని పరామర్శించిన రాకేష్ కిరణ్


మాజీ మంత్రి పెద్దిరెడ్డితో రాకేష్ కిరణ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి క్రియాశీలక కార్యదర్శి, వైసీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ జిల్లా జడ్జి దొరస్వామి కుమారుడైన రాకేష్ కిరణ్ శుక్రవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఇటీవల పెద్దిరెడ్డి చేతికి గాయం కావడంతో ఆయనను పరామర్శించారు. రాకేష్ కిరణ్ వెంట బాల శేఖర్, అశోక్, ప్రసాద్, గోవింద స్వామి తదితరులున్నారు.

ఇండి-గ్యాప్ పొలం బడి కార్యక్రమం


పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతులకు మెరుగైన వ్యవసాయ యాజమాన్యం పై ఇండి- గ్యాప్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏడిఏ ఆర్ రమేష్ రాజు, మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, ఏపీ ఎస్ఓపీసీఏ జిల్లా ఏవాల్యూయేటర్ మునిశేఖర్ రైతుల పొలాలను సందర్శించి పంటను పరిశీలించారు. మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విఏఏలు మోహన్ శ్రీవల్లి విష్ణు ప్రియ, 20 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

సుందరంగా చెత్త సేకరణ కేంద్రం


చెత్త సేకరణ కేంద్రంలో గ్రామ సర్పంచ్ మణి రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ఎస్బిఆర్ పురం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రం రంగులతో సుందరంగా రూపుదిద్దుకుందని గ్రామ సర్పంచ్ ఆర్.మణి రాజు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో సేకరించిన తడి,పొడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి ఎరువుగా ఉపయోగిస్తున్నామన్నారు.

ఏర్పేడులో ఎర్రజెండా ఆవిష్కరణ




ప్రజాశక్తి -ఏర్పేడు: అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినం సందర్భంగా ఏర్పేడులో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రంగయ్య ఎర్ర జెండా ఎగరవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరల అమలు గ్యారంటీ చట్టం కోసం, రైతుల రుణాల రద్దు కోసం పోరాటాన్ని పున:ప్రారంభించాలని పిలుపునిచ్చారు. 21న ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా జనరల్ బాడీ సమావేశం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పి.ధర్మారెడ్డి, మాసేపల్లి నాగరాజు రాయల్, వాకా భాస్కర్ రెడ్డి, సి.మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -ఏర్పేడు : కేవిబి పురం మండలం, కోవనూరు గ్రామానికి చెందిన గుర్రంకొండ మనోజ్ కుమార్ (సాంబార్ మనోజ్) రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని, ఎక్కువ ధరకు అమ్ముటకు గాను సుబ్బయ్య (సుబ్బడు), కోనేటి రాజేష్‌ల సహాయంతో పాపానాయుడుపేట నుండి రవాణా చేస్తుండగా ఏర్పేడు పోలీస్‌లు పట్టుకొని ముద్దాయిని అరెస్ట్ చేశారు. 1474 కేజిల బియ్యం, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరిచామని ఏర్పేడు సిఐ జయచంద్ర తెలిపారు.

ఇరిగేషన్ ఈఈ శివారెడ్డికి సత్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఇరిగేషన్ శాఖ నూతన ఈఈగా బాధ్యతలు చేపట్టిన శివారెడ్డిని తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళి నాయుడు శుక్రవారం ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఇరిగేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మురళి నాయుడు కోరారు. పెండింగ్‌లో వున్న నీరు- చెట్టు బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, ఇరిగేషన్ డిఈ ఆదినారాయణ నాయుడు, టీవో వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆస్తి, ఖాళీజాగా పన్నులు ఏక మొత్తంలో ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లిస్తే 5% రాయితీ ఇవ్వబడుతుందని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ తెలిపారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారికి వడ్డీపై 50% మినహాయింపు ఏప్రిల్ నెలాఖరకు పొడిగించినట్లు తెలిపారు.


అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

ప్రజాశక్తి-కోట : ఈ నెల 14వ తేదీన నిర్వహించబోయే అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు మీజూరు మాధవ్ మండల పరిధిలోని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రతి దళిత బిడ్డ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకరణతో దళితులను విడదీయాలని కుట్ర ఉందని, కానీ ఐక్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. త్వరలో కోట మండలంలో ఎస్సీ వర్గీకరణపై ర్యాలీ నిర్వహించబోతున్నామని తెలిపారు.

ఘనంగా ఉరుసు గంధోత్సవం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి హుస్సేనమ్మ ఉరుసు గంధోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవంలో భాగంగా గంధాన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రజలు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుస్సేనమ్మ దర్గా కమిటీ సభ్యులు ముని రామయ్య, తిరునామల్లి ముత్యాలబాబు, రాజేష్‌లు దర్గాను లైట్లతో అందంగా తీర్చిదిద్దారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం అయితపల్లిలో ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చిన అనంతరం కుట్టు మిషన్లను ఉచితంగా అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసి శేఖర్, సురేష్ రెడ్డి, బాలకృష్ణ, సక్కూరి ధనుంజయ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, మండల స్థాయి అధికారులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దాహం.. దాహం

తాగు నీరు @ 2 కి.మీ


మరమ్మతుకు నోచుకోని బోరు

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవిబి పురం మండలంలోని మారుమూల ప్రాంతమైన బ్రాహ్మణపల్లిలో సుమారు 180 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. చేతి బోర్లు మరమ్మతుకుగురై సుమారు సంవత్సరం గడుస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తాగడానికి నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నివాసితులు రెక్కాడితే గాని డొక్కాడని పేదలు. ఉదయం నిద్ర లేచి కూలి పనులకు వెళితే మరల తిరిగి సాయంత్రం గూటికి చేరుకుంటారు. ఇంటికి వస్తే తాగడానికి నీరు లేక సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. బ్రాహ్మణపల్లిలో విద్యుత్ మోటార్‌ను అమర్చారు అయితే ఆ నీరు అవసరాలకు వాడుకోవడానికి తప్ప, దాహం తీర్చుకోవడానికి పనికిరావు. గ్రామంలో తాగు నీటి బోర్లు రెండు ఉన్నప్పటికీ అవి మరమ్మతులకు గుర్కెడు నీటికి కష్టమే అని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గత సంవత్సరంగా ఎన్నిసార్లు అధికారులకు తమ గోడు వినిపించినా, అధికారులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలప్పుడు మాత్రం ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల వారు వచ్చి మీకు అది చేస్తాం.. ఇది చేస్తామని హామీలు కుమ్మరిస్తారు. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకునే నాధుడు కరువయ్యారని గ్రామ ప్రజలు తమ గోడును వెళ్లబుచ్చుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

బోర్లు మరమ్మతు చేయించాలి



గ్రామంలో రెండు చేతు బోర్లు ఉన్నాయి. మరమ్మతులు గురై సంవత్సరం గడుస్తున్న ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదు. మహిళలు, పిల్లలు, పెద్దలు ఆమడ దూరం వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. అధికారులు స్పందించి మంచినీటి బోర్లకు మరమ్మత్తులు చేయించాలి. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలి. లేకుంటే గ్రామస్తులు, మహిళల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తాం.

- సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు

దళితుడి భూమిలో దర్జాగా సాగు

- రాజకీయ పలుకుబడితో రికార్డులు మార్చారు
- చలానా కట్టినా సర్వేని అడ్డుకున్న భూకబ్జాదారులు



ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : పెట్లూరు పంచాయతీ సర్వేనెంబర్ 122-4 లో 53 సెంట్లు భూమిని గ్రామ దళితుడు పెట్లూరు పెద్ద వెంకటయ్యకి ప్రభుత్వం వారు పట్టా పాస్ బుక్కులు మంజూరు చేసి ఉన్నారు. అదే గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారుల కన్ను ఈ భూమిపై పడింది. దౌర్జన్యంగా ఇది మాదీ అంటూ వారి స్వాధీనంలో ఉంచుకొన్నారు. దళితుడు సర్వే చేయించుకునేందుకు చలానా కట్టారు. సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వేయరు చలపతి సిబ్బందితో దళితుడికి కొలతలు వేసి భూమి చూపించేందుకు కొలతలు వేయబోతూ ఉండగా, ఆక్రమించుకున్న నక్కల రాజయ్య, కిష్టయ్యలు కొలతలు వేయనీకుండా అడ్డుకున్నారు. దళితులు ఏమి చేయలేక వినుతిరిగారు. సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకునిన్యాయం చేయాలని, భూమిని ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

ఎంజీఎంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక ఎంజీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం ఐదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేలా గ్రాడ్యుయేట్ టోపీలను, బంగారు పతకాలను బహుకరించారు.

ఆదిశంకరలో ప్రాజెక్ట్ మోడల్ ఎగ్జిబిషన్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాజెక్ట్ మోడల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు నందకుమార్ మస్తాన్‌వలిలు వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుమాధవ్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలతో విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఇమ్మానుయేల్, వేణుమాధవ్, రాజయ్య, అమరేంద్ర, సురేష్, శ్రీనాథ్ శర్మ, ఏవో రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కస్తూర్బా గాంధీ జయంతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ పి.సి.రాయులు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ 156వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అమరావతి జెఏసి అధ్యక్షులు గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గూడూరు డిపో మేనేజర్‌ను కలిసి, ఉద్యోగుల సమస్యలపై, చర్చించారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు నారాయణ, డిపో కార్యదర్శి చెంగయ్య, కడప జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఈ.వి కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తి డిపో ఆవరణలో రెండో రోజు యూనియన్ నాయకులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సమస్యలు, హామీలు పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిరసనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ నాయకులు శేఖర్, వైడీ కుమార్, జోనల్ నాయకులు ఎల్బీకే రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు మురళి, శివకుమార్, పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రీ-సర్వేతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -కోట : రీ-సర్వేతో రైతుల భూసమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ కే.జే జే రావు తెలిపారు. శుక్రవారం కోట మండలం, సిద్ధవరం పంచాయతీ, ఇళ్లకూరుపాడులో రీ-సర్వే గ్రామసభ-అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కేజేజే రావు మాట్లాడుతూ రైతులు రెవెన్యూ భూరికార్డుల్లో భూ హక్కులను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, విఆర్ఓ శ్రీనివాసులు, సిద్ధవరం సర్పంచ్ ఇంగిలాల సుజాత, టీడీపీ నాయకులు తానా వెంకటేశ్వర్లు, దామరపు బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సెంట్రలైజ్డ్ ఆర్‌ఓ సిస్టమ్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సెంట్రలైజ్డ్ ఆర్ ఓ సిస్టమ్‌ను ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు శుక్రవారం ప్రారంభించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగులకు, సందర్శకులకు తాగునీటిని అందించేందుకు వీలుగా సుమారు రూ. 10 లక్షల వ్యయంతో సెంట్రలైజ్డ్ ఆర్ఓ సిస్టమ్, భవనంలోని ప్రతి అంతస్తులోనూ వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేశారు.

విశ్వనాథ ధ్యాన మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శుక్రవారం కంచి కామకోటి పీఠాధిపతులు పూజ్యశ్రీ శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి వర్సిటీలోని నైమిశా గురుకులంలో విశ్వనాథ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాటాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాష సంరక్షణకు, సనాతన ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తూ, విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేసేటువంటి విద్యార్థులకు వివిధ భారతీయ జ్ఞాన పరంపరలను అందిస్తూ, ప్రకృతితో అధ్యయనం ఏ విధంగా చేయాలి అనే విషయాన్ని వివరించారు. శాస్త్ర జ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా బోధిస్తూ ఉత్తమ నాగరికులుగా వారిని తయారు చేస్తున్నందుకు విశ్వవిద్యాలయం లోని వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధాగోవిందు త్రిపాఠి, పరీక్షా నియంత్రకులు డా.కె. సాంబశివమూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ ఎస్ దక్షిణామూర్తి శర్మ, పరమాచార్య శాస్త్ర పరిరక్షణ కేంద్ర నిర్దేశకులు ప్రొఫెసర్ కె. గణపతి భట్, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆచార్య, ఐక్యూ.ఎ.సి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కె.ఎస్, పిఆర్ఓ ప్రొఫెసర్ వి.రమేష్ బాబు, ఇంజనీర్ టి.భరణి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు, టిడిపి బీసీ విభాగం పట్టణ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు నివాళి అర్పించారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో, జనసేన కోటా వినుత ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పూలే చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ యాదవ్, రాజశేఖర్, సంతోష్ ,మహేష్, రమేష్ ,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి కె.సంతోష రావు మాట్లాడుతూ పూలే అసమానతల నిర్మూలనకు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్లు (ఎఫ్ఎసి) వై. లక్ష్మీ నరసయ్య, పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, పి. హెచ్. జానకిరామ్, ఆర్. పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు ప్రసాద్, వెంకట రాజు, కృష్ణారెడ్డి, మురళి, రామచంద్ర రావు, సురేంద్ర రావు, శ్రీకాంత్, నరేంద్రనాథ్, ఎస్ఇ/సివిల్ (ఇన్చార్జ్) తిరుమలరావు, బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చలపతి, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బాలాజీ కాలనీలో .. పూలే చిరస్మరణీయులని, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్ అన్నారు. పూలే జయంతిన బాలాజీ కాలనీలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : శుక్రవారం మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిదిగా మండల విద్యా వనరుల శాఖ అధికారిని ఆర్. భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, మండల వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, సీఆర్పీలు మునిమోహన్, గాంధీ, హేమలతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పూలే జయంతి సందర్భంగా పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు మండల విద్యా వనరుల కేంద్రానికి జ్యోతిరావు పూలే దంపతుల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్, రాష్ట్ర కార్యదర్శి తుమ్మ రవి, ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రావు, జిల్లా అధ్యక్షులు నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం, వెంకటాచలం మండల కార్యదర్శి రవి బాబు, జనార్ధన్, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోట : కోట మండలం, బీసీ గురుకులంలో శుక్రవారం జోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు అధ్యక్షులు మీజూరు మాధవ్, పాల మల్లిఖార్జున్, పనబాక హేమంత్, టీచర్లు కైలాసం, శంకరయ్య, వెంకటరమణయ్య, నాగేంద్ర, మెహన్ సాయి, భూపతి, ఎమ్. శ్రీనివాసులు, మస్తాన్, కావాలి కృష్ణ, కనుపూరు కృష్ణ, కళాశాల పాఠశాల సిబ్బంది దామరపు బాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వేసవిలో ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో 10 చలివేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అలాగే చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎస్ఎం మున్సిపల్ పాఠశాలలోని ఉర్దూ పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయవద్దని అక్కడే కొనసాగించాలని, ముస్లింలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు నరసింహులు, శ్రీనివాసులు రెడ్డి రహీం, మట్టం శ్రావణి, శ్రీదేవి, చంద్ర నిల్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం.. టవర్ క్లాక్ వద్ద ఉన్న డిఎస్ఆర్ మొబైల్స్ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ డిఎస్ఆర్ మొబైల్స్ పట్టణంలో నాణ్యమైన ఫోన్లను అందించి తక్కువ ధరలకు ప్రజల వద్దకు తీసుకు వచ్చిందని డిఎస్ఆర్ అధినేత సుధీర్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ మొబైల్స్ అధినేత సుధీర్ సెక్రటరీ జి.చంద్ర శేఖర్ వాకాటి రామ్మోహన్రావు , ప్రభాకర్ ,కె ఆర్. ఎం ,పయ్యావు మురళి నాయుడు , రాము గ్రానైట్ ప్రభాకర్ ,కృష్ణారెడ్డి ,కోట వెంకటేశ్వర్లు, శ్రావణ్ ,నాగేంద్ర విజయ్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్‌పిఎఫ్ ఏఎస్ఐ ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు రైల్వే స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు ఆయన అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో అక్రమంగా సరుకు రవాణా చేయడం, స్టేషన్‌లో అనధికార పొట్లాలను తీసుకెళ్లడం లేదా వస్తువులను అక్రమంగా రవాణా చేయడంలో సహాయం చేయడం వంటివి చేయరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బాలింతలు రక్తహీనతను అధిగమించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఆమందూరు, అంగన్వాడి కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, పిల్లలకు, బాలింతలకు ప్రభుత్వం పోషకాహారం అందిస్తుందని క్రమం తప్పకుండా పోషక పదార్థాలు తీసుకుని రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండాలని గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, టీచర్లు సునీత, బాటముని, అంగన్వాడి టీచర్లు సుమతి, సునీత, ధనమ్మ, మహిళా పోలీస్ శిరీష, ఆశ, ఏ. చిత్ర, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం మృతికి నివాళి

ప్రజాశక్తి- పిచ్చాటూరు: నారాయణవనం మండలం, తిరువట్యం గ్రామానికి చెందిన గ్రామ పెద్ద సుబ్రమణ్యం మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరువట్యం గ్రామానికి చేరుకుని సుబ్రమణ్యం బౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుర్వేదాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రాచీన, వంశపారంపర్య, ఆయుర్వేద వైద్య విధానాలు భవిష్యత్తు తరాలకు అందించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగం, పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్తంగా సాంప్రదాయ ఔషధం – ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం అనే అంశంపై 3 రోజులు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ పారంపర్య వైద్య విధానాలు, ఉపయోగించే ఔషధలు ప్రపంచానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కామాక్షమ్మ, ఆచార్యులు నాగలక్ష్మి దేవమ్మ, విజయ, వేణు, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

స్టీల్ కమ్మి చోరీకి యత్నం


నిందితులు వదలి వెళ్లిన కమ్మి, ట్రాక్టర్

ప్రజాశక్తి -ఏర్పేడు : గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని కొందరు ఏర్పేడు మండలం, చిందేపల్లి సమీపంలో గల ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో, కాలనీకి సంబంధించిన 12 ఎంఎం స్టీల్ 55 కమ్మిలను దొంగతనముగా ట్రాక్టర్‌లో వేసుకొని పోవడానికి ప్రయత్నించగా, అక్కడ ఉన్న సూపర్వైజర్, వాచ్మెన్ గట్టిగా కేకలు వేయగా లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను వదిలి చీకటిలో పారిపోయారు. ఆ ట్రాక్టర్ నంబరు పరిశీలించగా మడిబాక గ్రామానికి చెందిన మునిరత్నం నాయుడు కుమారుడు తేజ పేరుమీద ఉందని సమాచారం. ఈ చోరీలో తేజ కొంతమందితో కలసి వచ్చి పాల్గొన్నాడని, హౌసింగ్ కాలనీ ఏ.ఈ టి.కనక సత్య సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏర్పేడు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

వ్యక్తిపై దాడి


తీవ్రంగా గాయపడ్డ సురేష్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి ఎస్టియ నగర్‌కు చెందిన సురేష్ ప్రైవేట్ నెట్వర్క్ షాప్ నిర్వహిస్తున్నాడు. జగజీవన్ రావ్ పార్కు వద్ద బిపికె షాప్ నిర్వహిస్తున్న చాంద్ భాషాకు 20వేల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు చాంద్ బాషా ఆవేశంలో సురేష్‌పై కత్తితో దాడి చేశాడు. చుట్టుపక్కల వాళ్ళు అరవడంతో పారిపోయాడు. తీవ్ర గాయాలు పాలైన సురేష్‌ను స్థానికులు రుయా ఆసుపత్రికి తరలించారు. విషం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


ప్రమాదంలో గాయపడ్డ పర్వీన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక బనిగీసాహెబ్ పేట ప్రాంతంలో శుక్రవారం ఓ మహిళను లారీ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలైన సంఘటన చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక బనిగీసాహెబ్ పేటలో నివాసముంటున్న పర్వీన్ అనే మహిళ పనుల నిమిత్తం బనిగీసాహెబ్ పేట సెంటర్‌కి వెళుతున్న సమయంలో నెల్లూరు వైపు నుంచి వెంకటగిరి వైపుకు వెళుతున్న ఓ లారీ అదుపుతప్పి వేగంగా వచ్చి పర్వీన్ ను ఢీకొనింది. దీంతో పర్వీన్ రెండుకాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన పర్వీన్‌ను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్ఐ తిరపతయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటికి కటకట

ప్రజాశక్తి - చిల్లకూరు : వారం రోజుల నుంచి త్రాగడానికిమంచి నీళ్ల లేక చిల్లకూరు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చిల్లకూరు గ్రామం, మున్సిపాలిటీలో చేరిన తర్వాత, ఒక్కసారి మోటారు చెడిపోతే వారం రోజులు దాకా నీళ్ల రాక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అదే పంచాయతీగా ఉన్న రోజుల్లో మోటార్ చెడిపోతే ఒకటి రెండు రోజుల్లోనే సమస్య పరిష్కరించేవారని గ్రామస్తులు తెలిపారు. మున్సిపాలిటీలో కలిసిన తర్వాత మోటార్ల రిపేరు తీవ్ర జాప్యమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇకనైనా మోటార్లు రిపేరు చేయించాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుపతి నార్త్ సెక్షన్, సౌత్ సెక్షన్, ఈస్ట్ వెస్ట్ సెక్షన్‌లోని 33/11 కె.వి. అలిపిరి సబ్ స్టేషన్, ఇస్కాన్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కే.వి.ఫీడర్స్ మరమ్మతులు కారణంగా విద్యుత్ లైన్లను తొలగించుటకు 12న శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపిఎస్పిడిసీఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈస్ట్ సెక్షన్ నందు 11 కె.వి టీ.కె.స్ట్రీట్ , కె . కె.లేఔట్, 11 కె .వి. రైల్వే కాలని, సుందరయ్య నగర్, 11కె.వి మెడికల్ కళాశాల , 11 కె.వి మెటర్నిటీ హాస్పిటల్, 11కె.వి. డాక్టర్స్ క్వార్టర్స్ , 11.కె.వి. బర్డ్స్ హాస్పిటల్, 11కె.వి. పద్మావతి మెడికల్ కళాశాల, స్విమ్స్ హాస్పిటల్, రుయా హాస్పిటల్, ఏమ్.సి.ఆర్ కాలని, అంబేద్కర్ కాలనీ, గాలి వీధి, అనంత వీధి, మంచాల వీధి, త్యాగరాజ నగర్, సింగాలగుంట, వరద రాజ నగర్, హౌసింగ్ బోర్డు కాలని, ఎన్.జి.ఓ కాలని, రామచంద్ర నగర్, కె.టి.రోడ్డు, శాంతి నగర్, ఇస్కాన్ రోడ్డు, అన్నరావ్ సర్కిల్, గాంధీ రోడ్డు, ప్రకాశం స్ట్రీట్, జి.ఎన్ మాడ విధి, శ్రీ నగర్ కాలని, లెప్రసి కాలని, రాజీవ్ నగర్ కాలని, ఎస్.ఎల్.వి నగర్, గోవింద నగర్, మాధవ నగర్, ఎర్రమిట్ట, రాయల వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పైడిపల్లి, పరమేశ్వర మంగళం, దిగువ పుత్తూరు (మరాఠీ గేట్) పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, రూరల్ ఏఈ రవికుమార్ తెలిపారు.

లావణ్య, రాజాలకు అర్చక సంఘం పదవులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అర్చక సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా దర్భా లావణ్య, రాష్ట్ర కార్యదర్శిగా రాజా వైదీశ్వరన్‌లు నియమితులయ్యారు. వారి ఎంపికను ధ్రువీకరిస్తూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్చకుల సమస్యల పరిష్కారానికి తమ వంతు పాటుపడతానని తెలిపారు.